క్లుప్తంగా

'పీఎఫ్ ఖాతా తప్పులను సరిచేయాలి'



వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలోని పారిశుద్ధ్య విభాగంలో 272మంది కార్మికులు పనిచేస్తుండగా, 38మంది కార్మికులకు సంబంధించి పీఎఫ్ వివరాల్లో తప్పులు జరిగాయని, వాటిని సవరించాలని కోరుతూ తెలంగాణ మున్సిపాలిటీ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్యకు వినతిపత్రం అందించారు. గతంలోనే ఈ విషయమై పలుమార్లు విన్నవించినా పరిష్కరించడంలో ఆలస్యం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికులకు తగిన న్యాయం చేయాలని, మున్సిపల్‌కు సంబంధం లేని పులివైల సాయికిరణ్ పేరును పీఎఫ్‌లో, ఆఫీస్ నుంచి తొలగించి, కార్మికుల పేర్లను ఎక్కించాలన్నారు. లేనిపక్షంలో ఈ నెల 24వ తేదీ నుంచి రిలే నిరహార దీక్ష చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు దేవి సత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవునూరి గోపాల్, ఏ. గోపాల్ పాల్గొన్నారు.

ఎయిమ్స్ ఆసుపత్రికి అబ్దుల్ కలాం ఎక్స్‌లెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న వైద్యుడు శ్రీనివాస్

మంచిర్యాలటౌన్: మంచిర్యాలకు చెందిన ఎయిమ్స్ ఆసుపత్రి మల్టీ స్పెషాలిటీ విభాగంలో తక్కువ ఖర్చుతో అత్యాధునిక శస్త్ర చికిత్సలతో వైద్య సేవలు అందిస్తున్నందుకు గాను యాక్ట్ నౌ ఆర్గనైజేషన్ డాక్టర్ ఏపీజె అబ్దుల్ కలామ్ ఎక్స్‌లెన్స్ అవార్డు 2024ను ప్రకటించగా, ఆసుపత్రి తరుపున డాక్టర్ యెగ్గన శ్రీనివాస్ అందుకున్నారు. ప్రజలకు అత్యుత్తమ ఆరోగ్యంను అందించేలా వైద్య సేవలను అందించినందుకు ఈ అవార్డును హైదరాబాద్‌లోని హైటెక్స ఎగ్జిబిషన్ సెంటర్‌లో అందుకున్నట్లు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

వార్డుల్లో అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న చైర్‌పర్సన్

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి 1, 11, 12వార్డుల్లో సోమవారం అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. 11వార్డులో రూ.5లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డుకు, 12 వార్డులో రూ.3లక్షలతో చేపట్టనున్న సీసీ డ్రెయినేజీ నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వార్డు కౌన్సిలర్ నెల్లి శ్రీలత భూమిపూజ చేశారు. 1వ వార్డులో రూ.3లక్షలతో డ్రెయినేజీపై స్లాబ్, రోడ్డు నిర్మాణ పనులను వార్డు కౌన్సిలర్ సూరం సంగీత ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, డీఈ, టీపీవో, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి

మందమర్రిరూరల్: పట్టణంలోని రెండో జోన్‌కు చెందిన సత్యాన్వేశ్(21) సోమవారం విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. సత్యాన్వేశ్ డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం ఇంట్లో స్నానం చేసి తడి టవల్‌ను దండెంపై ఆరేయగా విద్యుత్ షాక్ తగిలింది. వెంటనే స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రికి, తర్వాత రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కాకోను దర్శించుకున్న భక్తులు



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

దండేపల్లి: దండారి ఉత్సవాల్లో భాగంగా దండేపల్లి మండలంలోని గుడిరేవు గోదావరి నదిఒడ్డున గల శ్రీపద్మల్‌పురి కాకో ఆలయాన్ని ఇంద్రవెల్లి మండలానికి చెందిన పలువురు ఆదివాసీ గిరిజన భక్తులు సోమవారం సందర్శించారు. కాకోను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు.

'ప్రత్యామ్నాయ'మే దిక్కు

- ప్రాణహిత వరదలో దెబ్బతిన్న పత్తి
- వేలాది ఎకరాల్లో నష్టం
- ఇప్పటికీ పరిహారం అందించని ప్రభుత్వం
- వరద తగ్గడంతో ఆరుతడి పంటలు సాగుచేస్తున్న రైతులు



వరదల అనంతరం రెండోసారి విత్తుకున్న పత్తి

వేమనపల్లి: ప్రాణహిత వరద ముంపు రైతులకు చివరకు ప్రత్యామ్నాయ పంటలే దిక్కయ్యాయి. జూన్ నెలలో విత్తిన పత్తి పంట మొత్తం జూలై, ఆగస్టు నెలల్లో రెండుసార్లు వచ్చిన బ్యాక్ వాటర్‌తో వరద పాలైంది. వేమనపల్లి మండలంలో సుమారు 2300, కోటపల్లి మండలంలో 1800, చెన్నూర్ మండలంలో 450ఎకరాలు, ప్రాణహిత లోతట్టు ప్రాంతాలైన కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం, బెజ్జూర్, చింతలమానపల్లి, కౌటాల, పెంచికల్‌పేట మండలాలకు చెందిన సుమారు 3వేల ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. పంట విత్తిన నెలన్నర లోపే వరద పాలు కావడంతో రైతులు పీకల్లోతు నష్టాల్లోకి వెళ్లారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో అతి భారీ వర్షాలు కురవడంతో ముంపు భూముల్లో మళ్లీ ఎలాంటి పంటలు సాగు చేయలేదు. సెప్టెంబర్ చివరి వారంలో వర్షాలు తగ్గుముఖం పట్టగా రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపారు. ఇప్పటికే రైతులు ఆరుతడి పంటలైన నువ్వులు, పెసర, జొన్నలాంటి పంటలు విత్తుకోగా బోరు, నీటి సౌకర్యం ఉన్న రైతులు ఆలస్యంగానైనా పత్తి, మిర్చీ, మొక్కజొన్న సాగు చేస్తున్నారు.

నాలుగేళ్లు నష్టమే...

ప్రాణహిత ముంపు ప్రాంతంలో పత్తి పంట చేళ్లు నాలుగేళ్లుగా ముంపు బారిన పడుతున్నాయి. కానీ అప్పటి బీఆర్ఎస్, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిన దాఖలాలు లేవు. ఏటా ముంపునకు గురైన సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు హడావుడి చేసి ముంపు ప్రాంతాలను సందర్శిస్తారు. సర్వేలు చేయిస్తాం, పరిహారం ఇప్పిస్తామని హామీలు ఇచ్చి ప్రభుత్వాలకు నివేదిక పంపడమే కానీ, పరిహారం అందిన దాఖలాలు లేవు. ఈ యేడాది దిగువన ఉన్న చెన్నూర్, జైపూర్, భీమారం, ఎగువన ఉన్న కుమురం భీం జిల్లా బెజ్జూర్, దహెగాం, చింతలమానపల్లి, పెంచికల్‌పేట, కౌటాల మండలాల రైతులకు ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. కానీ వేమనపల్లి, కోటపల్లి మండలాల రైతులకు నష్టమే జరగనట్లు ఎలాంటి పరిహారం మంజూరు చేయకపోవడం హాస్యాస్పదం. ఏటా పంటలు మునిగి సర్వం కోల్పోయి రైతులు అప్పుల పాలై సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. పరిహారం ఇప్పించాలని ధర్నాలు, ఆందోళనలు చేపడుతున్నారు. విధి లేక వర్షాలు తగ్గుముఖం పట్టాక ఆరుతడి పంటలు నీటి సౌకర్యం ఉన్న వారు వేరే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకుంటున్నారు.

మూడెకరాల పత్తి నష్టపోయా



భూమి కౌలుకు తీసుకొని మూడు ఎకరాల పత్తి సాగు చేసినా. ప్రాణహిత ముంపులో మొత్తం మునిగిపోయింది. అప్పుజేసి మరీ పెట్టుబడి పెట్టినా. కానీ నాకు ఏమీ మిగలలేదు. కనీసం ప్రభుత్వం పరిహారం ఇస్తదని ఆశపడ్డాం. కానీ వేమనపల్లి మండలానికి నష్టపరిహారం రాలేదు. అదే మిగితా మండలాలకు పరిహారం ఇచ్చారంటా. ప్రాణహితలో మునిగింది అధికారులకు కనబడలేదా. ఇప్పటికైనా ఇప్పించి ఆదుకోవాలి.

– దోకే చిన్నక్క, వేమనపల్లి

అప్పులపాలైన..



ఆరు ఎకరాల చేను కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేసుకున్నా. అందులో నాలుగు ఎకరాలు ప్రాణహిత వరద పాలైంది. దుఖానంలో తీసుకొచ్చిన అప్పు ఎట్ల తీరుతదో అర్థమైతలేదు. నాలుగేళ్ల నుంచి ఈ విధంగానే పంటలు మునుగుతున్నయ్. మా ముఖం చూసే వాళ్లు లేరు. పరిహారం ఇచ్చేటోళ్లు, అండగా నిలిచేటోళ్లు లేరు. ప్రభుత్వం నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలి.

– దందెర మహేశ్, వేమనపల్లి

'విద్యార్థి విప్లవోద్యమాల్లో పీడీఎస్‌యూది ప్రత్యేకస్థానం'



మాట్లాడుతున్న చరణ్

బెల్లంపల్లి: విద్యార్థి విప్లవోద్యమాల్లో పీడీఎస్‌యూది ఎంతో ప్రత్యేక స్థానమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్ అన్నారు. బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభను పురస్కరించుకొని సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యారంగంలో పీడీఎస్‌యూది 50వసంతాల సుదీర్ఘ చరిత్ర అని అన్నారు. ఎందరో విద్యార్థి నాయకులు పిడికిలి భిగించి ఉద్యమాన్ని ముందుకెళ్లారన్నారు. అమరుడు కామ్రేడ్ జార్జిరెడ్డి మతోన్మాదుల చేతిలో హతం కాగా, జంపాల చంద్రశేఖర్, శ్రీపాద శ్రీహరి ఎమర్జెన్సీ కాలంలో నియంతృత్వ పాలకుల తుపాకీ గుళ్లకు ప్రాణాలర్పించారని పేర్కొన్నారు. విద్యార్థి పోరాటాల్లో త్యాగాల చరిత్ర పీడీఎస్‌యూదని కొనియాడారు. 24న హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ స్టేడియంలో యాభై వసంతాల స్వర్ణోత్సవ సభను విద్యార్థులు దిగ్విజయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ శ్రేణులు విష్ణు, చత్రపతి, తిరుపతి, హేమంత్, రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఏఈగా శ్రీనివాస్

మందమర్రిరూరల్: మందమర్రి విద్యుత్ శాఖ ఏఈగా బొంకూరి శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అందుగులపేటలోని కార్యాలయంలో సిబ్బంది శాలు వా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లైన్‌మెన్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

లక్సెట్టిపేట: న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్సీగా పోటీచేయనున్న నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మున్సిఫ్ కోర్టుకు వచ్చిన ఆయన న్యాయవాదులతో మాట్లాడారు. న్యాయవాదులపై రోజు రోజుకు దాడులు పెరిగిపోతున్నాయని, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. న్యాయవాదుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. జర్నలిస్టుల అభివృద్ధి కృషి చేస్తానన్నారు. అనంతరం న్యా యవాదులు శాలువాలతో ఘనంగా సన్మానించా రు. బార్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, న్యాయవాదులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

జైపూర్: మండలంలో సోమవారం సాయంత్రం ఉరుముల, మెరుపులతో వర్షం కురిసింది. నర్వ భారత్ పెట్రోల్ బంకు సమీపంలో తాటి చెట్టుపై పిడుగు పడింది. గింజ ఎదిగే సమయంలో గాలివానతో కూడిన వర్షం కురవడంతో వరి పంటలు దెబ్బతిన్నాయి.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

మంచిర్యాలఅర్బన్: దుర్గం పోషం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న తల్లిదండ్రులులేని నిరుపేద కుటుంబానికి చెందిన ప్రేమ్‌కుమార్‌కి ఆర్థిక సాయం అందించారు. ఆనంద నిలయంలో సోమవారం ట్రస్టు చైర్మన్ దుర్గం రాజేశ్ విద్యార్థి ప్రేమ్‌కుమార్‌కి పాఠశాలకు సంబంధించిన సంవత్సర ఫీజు రూ.15వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో శిశుమందిర్ పాఠశాల గౌరవ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రావు, రెడ్‌క్రాస్ సభ్యుడు మహేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వల్లకట్ల రాజు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: పట్టణంలోని కనకదుర్గాకాలనీకి చెందిన హర్షవర్ధన్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా అతడి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు, కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్, నాయకులు మహంకాళి శ్రీనివాస్, నీలం శ్రీనివాస్‌గౌడ్, గోపురాజం పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల్లా కలిసుండాలి

- శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి
- ఘనంగా ఫ్యామిలీ డే



బహుమతులు ప్రదానం చేస్తున్న జీఎం దంపతులు



సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న మహిళలు

శ్రీరాంపూర్: సింగరేణి ఉద్యోగులంతా ఓ కుటుంబ సభ్యుల్లా కలిసుండాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఆదివారం రాత్రి ఫ్యామిలీ డే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జీఎం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శ్రీరాంపూర్‌లో 8582 మంది ఉద్యోగులు ఉన్నారని, కానీ క్లబ్‌లో కేవలం 189మంది మాత్రమే సభ్యులుగా ఉన్నారన్నారు. సభ్యుల సంఖ్య మరింత పెంచుకోవాలని సూచించారు. ఫ్యామిలీ డే వంటి కార్యక్రమాల వల్ల ఉద్యోగుల కుటుంబ సభ్యుల మధ్య స్నేహ సంబంధాలు ఏర్పడుతాయని, దీంతో మంచి వాతావరణం ఏర్పడుతుందన్నారు. సింగరేణి ఉద్యోగుల సంక్షేమం కోసం అనేక చర్యలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా సేవా సంస్థ సభ్యులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఫ్యామిలీ డే సందర్భంగా మహిళలకు, పిల్లలకు క్రీడా పోటీలు నిర్వహించి వారికి బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదా, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, సీనియర్ పర్సనల్ అధికారి కాంతారావు, క్లబ్ గౌరవ కార్యదర్శి సృజన్ పాల్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్, క్లబ్ సభ్యులు నర్సయ్య, శ్రీనివాస్, తోట సురేష్, సేవా సెక్రెటరీ కొట్టే జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రెస్క్యూ సిబ్బందికి సన్మానం



రెస్క్యూ సిబ్బందిని సన్మానిస్తున్న జీఎం

మందమర్రిరూరల్: ఈ నెల 15 నుంచి 17వరకు రామగుండం 2 ఏరియాలో రెస్క్యూ స్టేషన్ ఆవరణలో జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో మందమర్రి ఏరియా నుంచి పాల్గొన్న రెస్క్యూ సిబ్బంది పలు అంశాలలో ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం గెలిచిన రెస్క్యూ సిబ్బందిని ఏరియా జీఎం ఆఫీస్ ఆవరణలో జనరల్ మేనేజర్ దేవేందర్‌తో పాటు సిబ్బంది శాలువాలతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం రాజేశ్వర్ రెడ్డి, ఇన్‌చార్జి ఎంఆర్‌పి రాంమోహన్, డీవైపీఎం మైత్రేయ బంద్, రెస్క్యూ టీమ్ కెప్టెన్ గణేష్ రామన్, తదితరులు ఉన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

హామీలు అమలు చేయాలి

శ్రీరాంపూర్: సింగరేణి ఎన్నికల్లో హామీ ఇచ్చి గెలిచిన గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ నాయకులు హామీలను అమలు చేయాలని హెచ్‌ఎంఎస్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్ రెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికీ ఆ సంఘాల నాయకులు ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. కార్మికులకు సొంతింటి పథకం, అలవెన్స్‌లపై ఆదాయ పన్ను మాఫీ, ఆసుపత్రుల ఆధునీకరణ ఇతర హామీలను పరిష్కరించాలన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే కార్మిక వర్గం ఉద్యమాలకు సిద్ధంగా ఉందని తెలిపారు.

'హామీలు అమలు చేయడంలో విఫలం'

మందమర్రిరూరల్: ఎన్నికల్లో కార్మికుల సమస్యలపై హామీ ఇచ్చి గెలిచిన గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాలు హామీలు అమలు చేయడంలో విఫలమయ్యాయని హెచ్‌ఎంఎస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ఆరోపించారు. ఏరియాలోని యూనియన్ ఆఫీస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలకు యాజమాన్యం గుర్తింపు ధ్రువపత్రాలు అందించి నెల రోజులు కావస్తున్నా, ఇంతవరకు కార్మిక సమస్యలపై ఎలాంటి సమావేశం నిర్వహంచలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా గెలిచిన సంఘాలు కార్మిక సమస్యలపై పట్టించుకొని పరిష్కరించే విధంగా కృషి చేయాలని హితువు పలికారు. సమావేశంలో ఆ యూనియన్ నాయకులు సుదర్శన్, శ్రీనివాస రెడ్డి, రామస్వామి ఉన్నారు.

పోలీసు అమరుల త్యాగాలు అజరామరం



బెల్లంపల్లి: అమరుల స్మారక స్తూపం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఏసీపీలు, సీఐ, ఎస్సైలు

బెల్లంపల్లి: విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరుల త్యాగాలు అజరామరమని బెల్లంపల్లి ఏసీపీ ఎ.రవి కుమార్ అన్నారు. బెల్లంపల్లి ఏఆర్ పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో సోమవారం పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని అమరుల స్మారక స్తూపానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం పాటుపడుతున్నారన్నారు. ఈ క్రమంలో జరిగే సంఘటనల్లో ఏటా ఎందరో పోలీసులు సంఘ విద్రోహుల చేతిలో బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజ హితం కోసం అమూల్యమైన ప్రాణాలను పోలీసులు త్యాగం చేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. దేశ రక్షణలో ప్రాణం కంటే విధి నిర్వహణ గొప్పదని చాటి చెబుతున్నారన్నారు. పోలీసు అమరుల ప్రాణ త్యాగాల వల్ల ప్రజలు స్వేచ్ఛగా జీవించగలుగుతున్నారని వివరించారు. అమరుల పోరాట స్ఫూర్తితో పోలీసు యంత్రాంగం ముందుకు వెళ్తుందన్నారు. పోలీసు అమరుల కుటుంబాలకు ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ ఎస్.సుందర్ రావు, బెల్లంపల్లి వన్‌టౌన్, బెల్లంపల్లి రూరల్, తాండూర్ సీఐలు ఎన్.దేవయ్య, ఎండి.అఫ్జలుద్దీన్, కుమారస్వామి, ఆర్ఐ వామనమూర్తి, ఆర్ ఎస్సై ప్రవీణ్, తాళ్లగురిజాల ఎస్సై రమేష్, ఏఆర్ సిబ్బంది, స్పెషల్ పోలీసులు పాల్గొన్నారు.



మందమర్రిరూరల్: అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఏసీపీ రవికుమార్

పోలీస్ అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

మందమర్రిరూరల్: పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో గల పోలీస్ అమరవీరుల స్తూపం వద్ద మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి ఏసీపీ హాజరై స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బెటాలియన్ శివారులో బేస్ క్యాంప్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో శిక్షణ కానిస్టేబుళ్లకు మంగళవారం నుంచి శనివారం వరకు ఐదు రోజుల పాటు బేస్ క్యాంప్ ఉంటుందని కమాండెంట్ వెంకటరాములు సోమవారం తెలిపారు. బేస్ క్యాంప్‌లో అటవీ ప్రాంతాలు, గుట్టల్లో పోలీస్‌ల విధులు ఎలా ఉంటాయని, విధుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు ఫైరింగ్‌లోనూ శిక్షణ ఉంటుందని తెలిపారు. బేస్‌క్యాంప్ వైపు ఎవరూ వెళ్లవద్దని, గొర్రెలు, మేకలు, పశువులను అటువైపుగా మేతకు తీసుకెళ్లద్దని కూడా పంచాయతీ ఆధ్వర్యంలో గుడిపేట-నంనూర్ పునరావాస ప్రజలకు దండోరా వేయించారు.

ఆర్మీజవాన్‌కు సన్మానం



వహీద్‌ను సన్మానిస్తున్న మిత్రులు

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటకు చెందిన అబ్దుల్ వహీద్ 22ఏళ్లుగా ఆర్మీలో వీరజవాన్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందాడు. స్వగ్రామం వచ్చిన ఆయనకు మిత్రులు ఘన స్వాగతం పలికారు. స్థానిక జెడ్పీఉన్నత పాఠశాలలో ఆయనతో పదోతరగతి చదువుకున్న 1999–2000ఎస్సెస్సీ బ్యాచ్ మిత్రులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వహీద్ మాట్లాడుతూ.. దేశ రక్షణ కోసం ఆర్మీజవాన్‌గా పనిచేయడం ఎంతో గర్వంగా అనిపించిందన్నారు. దేశ రక్షణ కోసం యువకులు ఆర్మీలో చేరాలని పిలుపునిచ్చారు.

భీమారం ఎస్సైగా శ్వేత



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్వేత

భీమారం: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎస్సైగా శ్వేత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రాములు రామగుండం కమిషనరేట్‌కి బదిలీ కాగా, చెన్నూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న శ్వేత భీమారం పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొత్తగా వచ్చిన ఎస్సైకి సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

మాజీ ఎంపీపీ స్వర్ణలతకు కేటీఆర్ ఫోన్

- బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ



కేటీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న స్వర్ణలత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మాజీ ఎంపీపీ మందపల్లి స్వర్ణలత భర్త, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌ను దాడి కేసులో పోలీసులు జైలుకు తరలించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ సోమవారం ఫోన్ ద్వారా పరామర్శించి ఆమెకు ధైర్యం చెప్పారు. అంతకు ముందు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు మాజీ ఎంపీపీ స్వర్ణలత ఇంటికి వచ్చి పరామర్శించారు. అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

రహదారికి మరమ్మతు చేయించండి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తాండూర్: తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బతుకమ్మ కుంటకు వెళ్లడానికి రోడ్డు మార్గాన్ని నిర్మించాలని కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు కోరారు. తాండూర్ గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ తాండూర్ మండల అధ్యక్షుడు ఎండి ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, సింగిల్ విండో చైర్మన్ మాసాడి తిరుపతి, శ్రేణులు రఘు, మహేందర్, మహేష్, శంకర్, శేఖర్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార ఆవిర్భావ దినోత్సవం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో మత్స్యకార ఆవిర్భావ దినోత్సవం సోమవారం తెలంగాణ మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తిరుపతి, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.